క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

గుర్తు తెలియని మహిళ దుర్మరణం



మహిళ మృతదేహం

తగరపువలస: రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారిపై భీమిలి మండలం బోడమెట్టపాలెం కూడలిలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం చెందింది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసున్న ఈ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్టు భీమిలి పోలీసులు గుర్తించారు. ఈమె మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి వివరాలు తెలిస్తే భీమిలి పోలీసులను 91826 94835లో సంప్రదించాలని సీఐ కె.లక్ష్మణమూర్తి కోరారు.

దుర్గాలమ్మ పండగ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వరుదు కల్యాణి

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ పండగ మహోత్సవాల పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆదివారం ఆవిష్కరించారు. 12న తొలేళ్లు, 13న ప్రధాన పండగ జరపనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పిల్లా శ్రీనివాసరావు, పీస రామారావు, జగ్గుపిల్లి నాని, బోగవిల్లి నాని, పిల్లా సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, పిల్లా సూరిబాబు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతికి సంతాపం



తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం సీనియర్ జాయింట్ కార్యదర్శి సరగడ నాగేశ్వరరావు ఆదివారం సంతపేటలోని ఆయన నివాసంలో మృతి చెందారు. 1974లో మిల్లులో కార్మికునిగా చేరి 1979లో యాజమాన్యంతో జరిగిన పోరాటంలో కార్మికుల పక్షాన నిలబడ్డారు. ఈయన మృతిపట్ల యూనియన్ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ 2వ వార్డు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం : ఆనందపురం కల్యాణ మండపంలో ఆదివారం జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి డాక్టర్ లావణ్య వైద్య పరీక్షలు చేశారు. వారిలో 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మిగతా వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తనిఖీలు చేసుకున్న రోగుల కోసం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కుప్ప రాజశేఖర్, ముడసల శ్రీను, కుప్ప లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా బీచ్ పార్కులు



బీచ్ పార్కులో పరుచుకున్న పచ్చదనం

- రూ.35 లక్షలతో ఆధునికీకరణ
- సందర్శకులు, స్థానికుల్లో ఆనందం



బీచ్ పార్కులో ఆకట్టుకుంటున్న బుద్ధుడు, బౌద్ధ బిక్షువుల విగ్రహాలు

భీమునిపట్నం: భీమిలి తీరంలో ఉన్న రెండు పార్కులను అధికారులు ఆధునికీకరించడంతో అవి ఎంతో ఆకర్షణీయంగా తయారయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చే సందర్శకులతోపాటు స్థానికులు ఇక్కడ సేద తీరుతూ హాయిగా గడుపుతున్నారు. ఇక్కడి తీరంలో బీచ్‌పార్కు, దానికి సమీపంలో పొట్టి శ్రీరాములు పార్కు ఉన్నాయి. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుఫాను దాటికి బీచ్‌పార్కులోని సగభాగం సముద్రంలో కలిసిపోగా మిగిలిన భాగం బాగా దెబ్బతింది. పొట్టి శ్రీరాములు పార్కు కూడా పూర్తిగా పాడైపోయింది. అప్పటి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టి యథాతథ స్థితికి తీసుకొస్తామని చెప్పినా కేవలం ప్రకటనలకే పరిమితమైంది. దీంతో ఈ రెండు పార్కులు కళావిహీనంగా ఉండేవి. ఈ క్రమంలో పార్కులకు రోజూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, స్థానికులు నిరుత్సాహంగా వెనుతిరిగేవారు.

ప్రత్యేక శ్రద్ధతో ఆధునికీకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పర్యాటక రంగానికి ప్రాధాన్యమివ్వడంతో విశాఖ బీచ్‌తో పాటు ఇక్కడి పార్కులనూ ఆధునికీకరిస్తామని అధికారులు ప్రకటించారు. ఆ ప్రకారం గత సంవత్సరం బీచ్‌పార్కులో పనులు చేపట్టారు. అక్కడ దెబ్బతిని రంగులు వెలిసిపోయిన బుద్ధుడి విగ్రహం, దాని చుట్టూ ఉన్న బౌద్ధ భిక్షువుల బొమ్మలకు రంగులు వేసి, పరిసరాల్లో గ్రానైట్ పలకలతో సుందరంగా తీర్చిదిద్దారు. సందర్శకులు కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు, గడ్డి, పూల మొక్కలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉండే ఇతర బొమ్మలను బాగు చేసి రంగులు వేశారు. దీని సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు పార్కును దివీస్ సంస్థ సహకారంతో బాగు చేశారు. ఈ పార్కు చుట్టూ గోడలపై అందమైన బొమ్మలు వేయడంతోపాటు పొట్టి శ్రీరాములు విగ్రహానికి రంగులు వేశారు. పిల్లలు ఆడుకునే పరికరాలు, బెంచీలు ఏర్పాటు చేశారు. ఇలా ఈ రెండు పార్కులను రూ.35 లక్షల వ్యయంతో చక్కగా ఆధునికీకరించారు. అధికారుల కృషితో పార్కులు సుందరంగా ముస్తాబై అందుబాటులోకి రావడంతో స్థానికులతో పాటు సందర్శకులు కూడా సేద తీరి ఆనందంగా గడుపుతున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన బొమ్మలు



సుందరంగా తయారైన పొట్టి శ్రీరాములు పార్కు

వర్షాలు కురవాలని పూజలు



బిందెలతో నీరు తీసుకెళ్తున్న మహిళలు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో వర్షాలు కురవాలని కోరుతూ ఆదివారం వరద పాసికం నిర్వహించారు. మహిళలు బిందెలతో నీళ్లు తీసుకెళ్లి ఎర్ర చెరువులో పుట్టపై పోశారు. పుట్ట వద్ద మహిళలు పూజలు చేశారు. అనంతరం భోజనాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర నారాయణరావు, మాజీ సర్పంచ్ సురాల అప్పలనాయుడు, సుంకర పైడినాయుడు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయ ఈవోగా ప్రసాద్



తగరపువలస: సంగివలస కొత్తమ్మతల్లి (మూడు గుడులు) ఆలయ ఈవోగా బి.ప్రసాద్ బదిలీపై వచ్చారు. ఆయన అదనంగా కప్పరాడ వైభవ వేంకటేశ్వరస్వామి, అనకాపల్లి నూకాలమ్మ ఆలయాలకు ఈవోగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు సంగివలసలో ఈవోగా బాధ్యతలు నిర్వర్తించిన పి.ఎస్.ఎన్.మూర్తి నగరంలోని ఆర్ అండ్ బి కూడలిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. అలాగే సంగివలస కొత్తమ్మతల్లి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన తాటికొండ రాంబాబు బదిలీపై అనకాపల్లి నూకాలమ్మ ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం నూతన ఈవో ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

శొంఠ్యాంలో వంద మందికి కంటి పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు అజయ్

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో ఆదివారం విశ్వ ఆయుర్వేద పరిషత్ ఉత్తరాంధ్ర విభాగం అధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాఘవేంద్ర నేత్ర ఆస్పత్రి వైద్యుడు పి.అజయ్, వైద్య బృందం వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 48 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడానికి నిర్ణయించారు. మిగతా వారికి ఉచితంగా మందులు అందజేశారు. లెంక రాంబాబు, కోరాడ వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రేమీ మండలి వార్షికోత్సవం



మహిళకు సరకులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలి గౌరవ అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో పేద మహిళకు నిత్యావసర సరకులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఘనంగా మరిడమ్మ ఉత్సవం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో ఆదివారం మరిడమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మరిడమ్మకు ప్రతి రూపంగా ఉన్న పుట్ట స్థానంలో విగ్రహం ఏర్పాటు చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆధ్వర్యంలో నూతనంగా ఆలయం నిర్మించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉత్సవంలో మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బాందేవపురం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, పాండ్రంగి కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, బుగత ఎర్నాయుడు, కంటుబోతు రాజన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

బాలలకు దుస్తులు పంపిణీ

భీమునిపట్నం: సామాజిక సేవకుడు పల్లా వెంకటరావు వర్ధంతి సందర్భంగా పల్లా భరత్‌కుమార్ వీధి బాలలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి బాలలను కొన్ని ముఠాలు ఎత్తుకెళ్లి, వారి జీవితాలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి బాలలను గుర్తించి ఆశ్రయమిచ్చి చదివిస్తున్నామన్నారు. సుశీలా కనకరత్నం, కంటుభుక్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామదేవతల పండగలు



సంగివలసలో అమ్మవారి ఆలయం

తగరపువలస: భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గ్రామదేవతల పండగలు నిర్వహించనున్నారు. సోమవారం తొలేళ్ల సందర్భంగా ఉయ్యాల కంబాల ఉత్సవాలు నిర్వహించి మంగళవారం అనుపోత్సవం జరపనున్నారు. బుధవారంతో పండగలు ముగియనున్నాయి. జీవీఎంసీ 2వ వార్డు పరిధిలో సంగివలస, సంగివలస కాలనీ, వలందపేట, ఉప్పుపేట, ఇడదాసరిపేట, నమ్మివానిపేట, నమ్మివానిపేట కాలనీ తదితర 14 గ్రామాల్లో దుర్గాలమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వార్డులోని రాయప్పాలెం, భీమిలి మండల పరిధిలో ఉన్న రాయప్పాలెం, రేఖవానిపాలెం పంచాయతీల ప్రజలు నూకాలమ్మ, మరిడమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. అన్నవరం మత్స్యకార పంచాయతీలో భూలోకమ్మ, పోలమాంబ, సత్తెమ్మ తల్లి పండగలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పండగలు జరపనున్న గ్రామాలు విద్యుత్ దీపకాంతులతో వెలిగిపోతుండగా ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆదర్శనగర్‌లో అంధకారం



వీధి దీపాలు వెలగని ఆదర్శనగర్ ప్రాంతం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్ ప్రాంతంలోని మెజారిటీ వీధుల్లో వారం రోజులుగా వీధిదీపాలు వెలగక అంధకారంలో ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో శుభం అపార్ట్‌మెంట్లు మొదలుకుని టీచర్స్ కాలనీ, ఈఎస్‌ఐ రోడ్డు ప్రాంతాలు చీకట్లో ఉంటున్నాయి. అసలే ఈ ప్రాంతం శివారులో ఉండడంతో దొంగతనాలు, వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీనికితోడు ఈఎస్‌ఐ ఆవరణ మొత్తం తుప్పలతో నిండి ఉన్న కారణంగా అందులోని విష పురుగులు ఆదర్శనగర్‌లోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అరకొర వసతులతో ఉన్న ఆదర్శనగర్‌ను అంధకారం వేధిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో వెలగని వీధి దీపాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

నగరపాలెంలో ‘లో ఓల్టేజీ’ సమస్య

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీని లో ఓల్టేజీ సమస్య వేధిస్తోంది. ఈ కారణంగా విద్యుత్ ఉపకరణాలు పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని పంచాయతీ వాసులు వాపోతున్నారు. అసలే వేసవి తాపానికి తాళలేకపోతున్న తమకు లో ఓల్టేజీ కారణంగా కనీసం ఫ్యాన్లు కూడా తిరగడం లేదని వాపోతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంచాయతీలోని ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ భీమిలి విద్యుత్ శాఖ అధికారులకు సర్పంచ్ పొట్నూరు చాయాగౌతమి ఆదివారం ఫిర్యాదు చేశారు.

జగన్నాథ స్వామికి జ్యేష్ఠాభిషేకం



జగన్నాథునికి పూజ చేస్తున్న సింగరాచార్యులు

భీమునిపట్నం: స్థానిక జగన్నాథ స్వామి ఆలయంలో ఆదివారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా స్వామికి జ్యేష్ఠాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు చేతుల మీదుగా అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసు పెంచాలని వినతి



ఆలయంలో చంద్రశేఖర్‌రెడ్డితో ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వ్యవహారాలకు సంబంధించిన ముఖ్యమంత్రి సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో శ్రీనివాసరావు అందజేశారు. కాగా రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు హరి, తదితరులు చంద్రశేఖర్‌రెడ్డిని కలిశారు. దేవస్థానాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన చంద్రశేఖరరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్‌రెడ్డిని ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య ఉపాధ్యక్షుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సభ్యుడు లంక సూరిబాబు తదితరులు కలిశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



నేవీ అధికారులు అందజేసిన సైకిళ్లతో విద్యార్థులు

ఆనందపురం : పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని డీఈవో చంద్రకళ సూచించారు. మండలంలోని నేత్తేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ వాతావరణంలో రోజురోజుకూ కాలుష్యం పెరుగుతోందని, నియంత్రణకు మొక్కలు పెంచాలని సూచించారు. నేవల్ కమాండెంట్ హరి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థినుల సైక్లింగ్ కోసం ఐదు సైకిళ్లను నేవీ సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో జీఎస్‌వో సత్యనారాయణ, సైంటిఫిక్ అసిస్టెంట్ ప్రవీణ్, ఏపీసీ శ్రీనివాసరావు, ఆనందపురం, భీమిలి కేజీబీవీల ప్రత్యేకాధికారులు చంద్రకళ, కుమారి గంగ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ



అంబేడ్కర్ కూడలిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న చిట్టివలస ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో ఆదివారం పలుచోట్ల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. చిట్టివలస ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అంబేడ్కర్ కూడలి వద్ద మజ్జిగ పంపిణీ చేయగా, మెయిన్‌రోడ్డులో చిట్టివలస సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పంపిణీ చేశారు. కార్మికవాడలో దేవాంగుల సంక్షేమ సేవా సంఘ ప్రతినిధులు, బైపాస్‌రోడ్డులోని ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద శ్రీషిర్డీసాయి ఆటో సంఘం, ప్రైవేట్ మార్కెట్ వద్ద వర్తక సంఘం, శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ఆలయ ప్రతినిధులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మజ్జిగ పంపిణీ చేశారు.

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట బస్టాప్ వద్ద గంధరాజు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక నాయకుడు మేరుగు చిన్నారావు ఆదివారం ప్రారంభించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. దూడ నర్సింగ్, మద్దుల సత్యరాజు, చవాకుల మారయ్య, చవాకుల అప్పలరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి గోస్తనీపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభం



టి.నగరపాలెం - ఎల్లారమ్మ మెట్ట వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మించనున్న ప్రాంతం

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం నుంచి ఎల్లారమ్మ మెట్టను అనుసంధానిస్తూ గోస్తనీ నదిపై రూ.2.96 కోట్లతో నిర్మించనున్న వంతెన పనులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన భూమి పూజ ఈ ఏడాది ఏప్రిల్ 30న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేశారు. దివీస్ లేబొరేటరీ ఆర్థిక సహకారంతో నిర్మించనున్న వంతెన పనులు ప్రారంభించినప్పటి నుంచి ఆరు మాసాల్లో పూర్తి చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. ఈ వంతెన పూర్తయి గోస్తనీ నదిపై నుంచి రాకపోకలు సాగిస్తే నదిలోకి దిగాల్సిన అవసరం ఉండదని స్థానికులు అంటున్నారు.

బబ్బేలమ్మ పండగకు ఏర్పాట్లు



బబ్బేలమ్మ వారు



విద్యుత్ దీపాల అలంకరణలో బబ్బేలమ్మ అమ్మవారి ఆలయం

పీఎం పాలెం: స్థానికుల ఆరాధ్య దేవత బబ్బేలమ్మ పండగను 12 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న సందర్భంగా పాత పీఎం పాలెం, పిలకవానిపాలెం, పీఎం పాలెం, లక్ష్మివానిపాలెంలో ప్రతి ఇంటా సందడి నెలకొంది. మూడు రోజులపాటు విందు, వినోదాలతో ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలు నిర్వహించనున్నామని స్థానికులు తెలిపారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా అమ్మవారు నిత్య పూజలు అందుకుంటున్న విషయం తెలిసిందే. కారుషెడ్ కూడలికి సమీపంలో ఉన్న బబ్బేలమ్మ పండగలో భాగంగా 5న తొలేళ్లు, 6న అనుపోత్సవం నిర్వహించనున్నారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న అర్చకులు

భీమునిపట్నం: కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారికి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పూలతో అర్చకులు పురాణం శేషాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.ఎస్.ఎన్ మూర్తి, కె.శ్రీనివాసరావు, కె.భానోజీరావు, కె.చంద్రశేఖర్, వి.తాతాజీ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు

కొమ్మాది / పీఎం పాలెం: పీఎం పాలెం శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ సాయి కళానికేతన్ కూచిపూడి నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా గణపతి పాట, దశావతారం, శివతాండవం, సీతా కల్యాణం నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వేంకటేశ్వర దివ్యక్షేత్రం సాంస్కృతిక కార్యక్రమాల వేదిక వద్ద నిర్వహించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ సేవానగర్ 33/11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ వై.సురేష్ కుమార్ చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీసీ లే అవుట్, టీచర్స్ లే అవుట్, అమరావతి నగర్ కాలనీ, సేవానగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.